# దేవాదాయ శాఖ పనుల్లో పారదర్శకతకు పెద్దపీట

- కాంట్రాక్టు చెల్లింపులకు ప్రధాన కార్యాలయంలో అకౌంట్స్ విభాగం
- రూ.5 కోట్లకు పైబడిన పనుల పర్యవేక్షణకు రాష్ట్రస్థాయి టెండర్ కమిటీ
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ





**అమరావతి, ఆంధ్రప్రభ:** దేవాదాయ శాఖ పనుల టెండర్లలో పారదర్శకతకు పెద్దపీట వేసే విధంగా పలు నిర్ణయాలను తీసుకున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ) కొట్టు సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు పనుల్లో పారదర్శకతకు పెద్దపీట వేసే విధంగా పలు నిర్ణయాలు తీసుకున్నామన్నారు. దేవాదాయ శాఖలో పెద్ద ఎత్తున కాంట్రాక్టు వర్కులు జరుగుతున్నాయని, అయితే కాంట్రాక్టు పనుల్లో నాణ్యతకు పెద్ద పీట వేసే విధంగా కాంట్రాక్టర్లలో పోటీ తత్వాన్ని పెంచేందుకు పలు చర్యలు తీసుకున్నామని,. అదే సమయంలో వారికి చెల్లించాల్సిన పేమెంట్ల విషయంలో జాప్యాన్ని నివారించేందుకై కమిషనరేట్ కార్యాలయంలో ఒక అక్కౌంట్స్ విభాగాన్ని ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా జరిగే కాంట్రాక్టు పనులన్నింటికి ఈ అక్కౌంట్స్ విభాగం ద్వారానే చెల్లింపులు చేయనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని పలు దేవాలయాల అభివృద్ధికై దాదాపు రూ.225 కోట్ల అంచనా వ్యయంతో విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవాలయం, రూ.150 కోట్లతో శ్రీశైలం శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి దేవాలయం తో పాటు కాణిపాకం, శ్రీకాళహస్తి, అన్నవరం దేవాలయాల అభివృద్ధి పనులను ఇప్పటికే చేపట్టడం జరిగిందన్నారు. అదే విధంగా సింహాచలం, ద్వారకా తిరుమల దేవాలయాల అభివృద్ధి పనులను కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీని కోసం ఇప్పటికే పలు టెండర్లను పిలిచామని,. ఈ టెండర్ల ఖరారు, అభివృద్ధి పనులన్నీ ఎంతో పారదర్శకంగా జరిగేందుకు రూ. 5 కోట్లు పైబడిన ఆలయాల అభివృద్ధి పనుల కోసం దేవాదాయశాఖ కమిషనర్ నేతృత్వంలో రాష్ట్రస్థాయి టెండర్ల పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. పలు దేవాలయాల్లో ప్రసాదాలు తయారీకి ఉపయోగించే ప్రధాన పదార్థాల రేట్లలో వ్యత్యాసాన్ని గమనించామన్నారు. ఈ వ్యత్యాసాన్ని నియంత్రించేందుకు ప్రధాన పదార్థాల రేట్లను రాష్ట్ర స్థాయిలో నిర్ణయించేందుకు సైతం ఈ కమిటీ పని చేస్తుందని చెప్పారు. దేవాలయాల్లో ప్రసాదాల నాణ్యతను పరీక్షించేందుకు ఎన్.ఏ.బి.ఎల్. ఆమోదం పొందిన ల్యాబ్ తో ఒప్పందం కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు.

**చతికిలబడ్డ టీడీపీ..**

జాతీయ పార్టీగా ప్రకటించుకున్న తెలుగుదేశం పార్టీ చతికిలపడిపోయిందని, తెలంగాణలో రానున్న ఎన్నికల్లో పోటీ చేయబోమని ఆ పార్టీ చెప్పడం అందుకు నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రకటనలు చూస్తుంటే పార్టీ పని అయిపోయిందని అనుకోవాల్సి వస్తుందన్నారు. తెలంగాణలో డిపాజిట్లు కూడా రావనే ఉద్దేశంతోనే టీడీపీ పోటీ చేయడానికి వెనుకంజ వేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రానున్న ఎన్నికల్లో ఇక్కడ కూడా అదే పరిస్తితే నెలకొంటుందన్నారు. ఏపీలో ఒంటరిగా పోటీ చేయలేక ప్రియురాలు వంటి జనసేన పంచన చేరిందని ఎద్దేవా చేశారు. తెలంగాణలో జనసేన బీజేపీతో కలసి వెళుతూ టీడీపీని దూరం పెట్టినట్లేనని వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి ఏపీలో వారి పొత్తులు ఎంతవరకు నిలబడతాయని ప్రజలు ఆలోచిస్తున్నారన్నారు. మేముంటేనే టీడీపీ అని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించడం చూస్తుంటే గతంలో అతను చెప్పినట్లుగా టీడీపీ బలహీన పడిందని నిర్ధారణ అయ్యిందన్నారు.

# ఒకడుగు ముందుకు... రెండడుగులు వెనక్కి



- మందకొడిగా పోలవరం ప్రాజెక్టు పనులు

**పోలవరం, ప్రభన్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌ను సస్యశ్యామలం చేసే వరప్రదాయిని , తాగు, సాగునీరు అందించే ఆంధ్రుల జీవనాడి.. పోలవరం ప్రాజెక్టు. ఆ ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగుతున్నాయి. భారీ వరదలు, నిధుల కొరత తదితర కారణాలతో రెండేళ్ళ క్రితం పూర్తికావాల్సిన ప్రాజెక్టు నిర్మాణం జాప్యం జరుగుతోంది. వచ్చే జూన్ నాటికి ప్రాజెక్టు పూర్తి కావాలని కేంద్రం స్పష్టం చేస్తుంటే ... రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 2025 వరకు గడువు ఇవ్వాలని కోరుతోంది. ఈ నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయాలని ముఖ్యమంత్రి జగన్ కేంద్రంపై ఒత్తిడి పెంచారు. పోలవరం ప్రాజెక్టులో తొలిదశ నిర్మాణం పూర్తికావడానికి రూ. 17వేల 148 కోట్లు అవసరమవుతాయని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ) సీడబ్ల్యూసీకి ప్రతిపాదనలు పంపింది. వాటిని పరిశీలించిన సీడబ్ల్యూసీ, తొలిదశ పూర్తికి రూ.15 వేల 661 కోట్లు అవసరమవుతాయని లెక్కగట్టింది. తొలిదశ కింద ఈ మొత్తాన్ని విడుదల చేయాలని సీడబ్ల్యూసీ ఛైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీకి సిఫారసు లేఖ పంపారు. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పిపిఎ)ను హైదరాబాద్ నుండి రాజమండ్రికి తరలించాలని కేంద్రం నిర్ణయించిందని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో సీపేజీ వాటర్‌ను డివాటరింగ్ చేసే కార్యక్రమం మాత్రమే జరుగుతోంది. పిపిఎ రాజమహేంద్రవరానికి తరలించడం వల్ల ప్రతిపాదనలు త్వరితగతిన క్లియరెన్స్ పొందేందుకు మార్గం దొరికినట్లవుతుంది. అలాగే ఎప్పటికప్పుడు పిపిఎ అధికార బృందం త్వరితగతిన ప్రాజెక్టు పనులను దగ్గరుండి చూడగలుగుతుందని భావిస్తున్నారు. పిపిఎ కార్యాలయాన్ని రాజమహేంద్రవరానికి తరలించడం చూస్తే పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వమే పర్యవేక్షిస్తుందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదే నిజమయితే, రాష్ట్ర ప్రభుత్వానికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం నుండి విముక్తి లభించినట్లవుతుంది.

పోలవరం తొలిదశలో మిగిలిన పనులు పూర్తిచేయడానికి ఇప్పటికే 12 వేల 911 కోట్ల రూపాయలు ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అంగీకరించారు. దీనికి సంబంధించి జూన్ 5న కేంద్ర ఆర్థికశాఖ మెమో కూడా జారీచేశారు. అయితే.. అవి సరిపోవని రాష్ట్ర ప్రభుత్వం అంటోంది. లైడార్ సర్వే ప్రకారం 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో అదనంగా 36 గ్రామాలు వస్తాయని తేలిందన్నారు. దీంతో ఆ గ్రామాల ప్రజలకు తొలిదశ కిందే పునరావాసం కల్పించాలని వైసీపీ ప్రభుత్వం ప్రతిపాదన పంపింది. ఆ ప్రతిపాదనను సూత్రప్రాయంగా అంగీకరించిన కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్.. ఆ మేరకు సవరించిన ప్రతిపాదనలను రూపొందించాలని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధాని మోడీ ఆదేశాల మేరకు తొలిదశ పూర్తికి రూ.12వేల 911 కోట్లు విడుదల చేసేందుకు అంగీకరించిన కేంద్ర ఆర్థిక శాఖ, 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని 36 గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడానికి కూడా సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఆ గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించడానికి అదనంగా 2 వేల 749 కోట్లు అవసరమని సీడబ్ల్యూసీ లెక్కగట్టింది. అంటే.. తొలిదశ పూర్తికి కేంద్రం విడుదల చేసేందుకు అంగీకరించిన రూ.12 వేల 911 కోట్లకు.. మరో 2 వేల 749.85 కోట్లు కలిపి... మొత్తంగా రూ.15 వేల 661 కోట్లు అవుతుందని అంచనా వేసింది కేంద్రం జల సంఘం. ఈ నిధులు విడుదల చేయాలని కేంద్ర జల్‌శక్తి శాఖకు సిఫార్సు చేసింది. జల్‌శక్తి, ఆర్థిక శాఖలు కేంద్ర కేబినెట్‌కు కూడా ఈ ప్రతిపాదనలు పంపనున్నాయి. దీనిపై కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేస్తే పోలవరం తొలిదశ పూర్తికి అవసరమైన నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది. పోలవరం పూర్తి చేయడానికి 2025 వరకు గడువు ఇవ్వాలని కేంద్రాన్ని ఏపీ ప్రభుత్వం కోరింది. అయితే అందుకు కేంద్రమంత్రి అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. 2024 జూన్‌లోగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని గజేంద్రసింగ్ షెకావత్ ఆదేశించారు. అనుకున్న సమయానికి పూర్తి చేయాలని సూచించారు. కేంద్రం నుంచి నిధులు విడుదల అయితే... పోలవరం ప్రాజెక్టు పనుల్లో వేగం పెరగనుంది. త్వరలోనే ప్రాజెక్టు తొలిదశ పనులు పూర్తి అవుతాయని అంచనా వేస్తున్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా లక్ష మంది పేదలకు రిఫరల్ సేవలు



- ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆకస్మిక తనిఖీ

**అమరావతి, ఆంధ్రప్రభ:** జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ఇప్పటి వరకు 55 లక్షల మంది ఓపీకి రాగా , వీరిలో దాదాపు లక్ష మందికి ఆరోగ్యశ్రీ కింద మెరుగైన వైద్యానికి డాక్టర్లు రిఫరల్‌కు పంపించారని వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు అన్నారు. కేవలం రిఫరల్‌తో ఆగిపోకుండా చికిత్స అనంతరం తిరిగి గ్రామాలకొచ్చాక కూడా ఆయా పేషంట్ లు ఏమేరకు సంతృప్తి పొందారో ఫీడ్ బ్యాక్ తీసుకుని బాగుందని సంతృప్తి చెందే వరకూ పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సూచించారన్నారు. మంగళగిరి టిడ్కో ఇళ్ల సముదాయాల మార్కండేయ కాలనీ అర్బన్ ప్రయిమరీ హెల్త్ సెంటర్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో అక్కడికక్కడే పూర్తి స్థాయి షుగర్ టెస్టులు చేయడానికి చర్యలు తీసుకోనేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కమిషనర్ నివాస్, ఆరోగ్య శ్రీ సిఇవో హరింధరప్రసాద్ లకు ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్యశ్రీ బ్రోచర్ ఇంటింటికీ పంపిణీ గురించి, వైద్య సేవలు ఎలా అందుతున్నాయని శిబిరానికొచ్చిన రోగులు , వృద్ధులు, గర్భిణుల నుంచి అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగులు , ఫోల్డర్లు సరిపడా ఉన్నాయా లేదా అని ప్రశ్నించారు. డాక్టర్ దగ్గర డేటా ఎంట్రీ ఆపరేటర్ అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎం.టి.కృష్ణబాబు మీడియాతో మాట్లాడుతూ, గతంలో ఒక యుపిహెచ్సి పరిధిలో ఒక జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించాలనుకున్నామనీ , అయితే ప్రతి వార్డు సచివాలయంలో కూడా శిబిరాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారన్నారు.

# డ్రైవర్ రాంసింగ్‌కు ఆర్టీసీ ఎండీ తిరుమలరావు పరామర్శ



**అమరావతి, ఆంధ్రప్రభ:** కావలి బైపాస్ రోడ్డులో ఈ నెల 26న దుండగుల దాడిలో గాయ పడి విజయవాడ ఆర్టీసీ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న ఆర్టీసీ డ్రైవర్ బీ.రాంసింగ్‌ను మంగళవారం ఎండీ సీహెచ్ ద్వా రకా తిరుమలరావు పరామర్శించారు. దాడి పూర్వపరాలు అడిగి తెలుసుకొని అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. బాధిత డ్రైవర్ పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్యసేవలు అందించాలని చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అప్పారావును ఆదేశించారు. ఆందోళన చెందొద్దని కుటుంబ సభ్యులకు ఆర్టీసీ ఎండీ భరోసా ఇచ్చారు. ఈ తరహా ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీలను అప్రమత్తం చేశామని, ఘటన తెలిసిన వెంటనే నెల్లూరు జిల్లా ఎస్పీతో మాట్లాడినట్లు తెలిపారు. ఇప్పటికే నిందితులను పోలీసు శాఖ అరెస్టు చేసినట్లు చెపుతూ రామ్‌సింగ్ త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పండ్లు అందజేసి ధైర్యం చెప్పారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఔటు పేషంట్లతో ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, డాక్టర్ల పర్యవేక్షణ, సిబ్బంది ప్రవర్తన, మందుల లభ్యతపై ఆరా తీశారు. ఆసుపత్రి నిర్వహణ తీరుపట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(పరిపాలన) కేఎస్ బ్రహ్మానంద రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డీవీఎస్ అప్పారావు, జనరల్ సర్జన్ డాక్టర్ పీ.శ్రీనివాసరావు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

# ఏపీకి 12, తెలంగాణకు 22 స్పెషల్ ఆపరేషన్ మెడల్స్

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, సరిహద్దుల రక్షణ, ఆయుధాల నియంత్రణ, మాదకద్రవ్యాల నియంత్రణ వంటి ఆపరేషన్లలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి 'కేంద్ర హోంమంత్రి స్పెషల్ ఆపరేషన్ మెడల్' పేరుతో 2023 సంవత్సరానికి కేంద్రం అవార్డులు ప్రకటించింది. స్పెషల్ ఆపరేషన్లలో పాల్గొన్న సిబ్బందిని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఈ మెడల్స్‌ను 2018లో కేంద్ర హోంశాఖ ప్రారంభించింది. ప్రతియేటా అక్టోబర్ 31న మెడల్స్‌కు ఎంపికైన పోలీసు, పారా మిలటరీ విభాగాల సిబ్బంది జాబితాను విడుదల చేస్తూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వ విభాగాలతో పాటు రాష్ట్రాల పోలీసు విభాగాలు చేపట్టే స్పెషల్ ఆపరేషన్లను ఈ కేటగిరీలో పరిగణలోకి తీసుకుంటారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ నుంచి 12 మందికి, తెలంగాణ నుంచి 22 మందికి మెడల్స్ దక్కాయి. ఏపీ నుంచి మెడల్స్ పొందినవారిలో వినీత్ బ్రిజ్‌లాల్ (ఐజీ), బాబూజీ అట్టాడ (ఎస్పీ), ఈజీ అశోక్ కుమార్ (నాన్ కేడర్ ఎస్పీ) తదితరులున్నారు. తెలంగాణ నుంచి మెడల్‌కు ఎంపికైన వారిలో రాజేశ్ కుమార్ (ఐజీ), నరేందర్ నారయణ్ రావు చుంగి (ఎస్పీ), ఎస్. చైతన్య కుమార్ (నాన్ కేడర్ ఎస్పీ), ఆర్. శ్రీనివాస్ (డీఎస్పీ) తదితరులున్నారు.

# మెరిట్ ఆధారంగానే స్టాఫ్ నర్స్ పోస్టింగ్స్

**రాజమహేంద్రవరం ఆర్డీ పద్మా శశిధర్**

**అమరావతి, ఆంధ్రప్రభ :** మెరిట్ ఆధారంగానే స్టాఫ్ నర్స్ పోస్టింగ్స్ ఇవ్వడం జరుగుతోందని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని రాజమహేంద్రవరం (జోన్-2) ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకురాలు డాక్టర్ పద్మాశశిధర్ చెప్పారు. కొందరు దళారులు అధికారుల్ని మేనేజ్ చేస్తామని దరఖాస్తు దారుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూళ్ళు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింద న్నారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాల్సిందిగా సూచించారు.

వెయిటేజ్ మార్కుల కోసం సమర్పించే సర్వీస్ సర్టిఫికెట్లు తప్పనిసరిగా సంబంధిత అధికారి ధ్రువీకరణను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తు దారులు కోవిడ్ సమయంలో పనిచేసిన కాలానికి సంబంధించి జీతభత్యాల వివరాలు ఉన్న బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేసే సమయంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు సమర్పించిన సర్వీస్ సర్టిఫికెట్లు ఫేక్ అని తేలినట్లైతే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.

# 16 నెలల్లో రూ.2 వేల కోట్ల ఇసుక దోపిడీ

- ఆ మొత్తంమంతా తాడేపల్లి ప్యాలెస్‌కే వెళ్తోంది
- ప్రజలకు సమాధానం చెప్పాలి
- రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి డిమాండ్



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో ఇసుక దోపిడీ ద్వారా రూ.రెండు వేల కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకున్నాయంటూ ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో ఇసుక దోపిడీపై పలు గణాంకాలు, చిత్రాలను ప్రద ర్శిస్తూ ఆమె వివరాలు వెల్లడించారు. గతంలో ఉచితంగా ఇచ్చిన ఇసుకను ఇప్పటి ప్రభుత్వం వ్యాపారంగా మార్చిందన్నారు. గతంలో ఇసుక ట్రాక్టర్ ఎగుమతి, దిగుమతుల తో కలిపి రూ.వెయ్యి ఉంటే ఇప్పుడు రూ.6వేల వరకు పలుకుతోందన్నారు. ఇసుక తవ్వకాల్లో నిబంధనలు పాటించడం లేదని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక దోపిడీపై ప్రజకలు సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో నిర్మాణ ఖర్చులు పెరిగి భవన నిర్మాణ రంగం కుదేలైందని,. దీంతో 40 లక్షల భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి, 2021 మే 3న కొత్త విధానం తీసుకొచ్చారని, అయితే మూడు జోన్లను కలిపి ఇసుక తవ్వకాల్లో ఏ మాత్రం అనుభవం లేని ఢిల్లీకి చెందిన జయ ప్రకాష్ పవర్ వెంచర్స్‌కు కాంట్రాక్టు కట్టబెట్టారన్నారు. పోటీదారులు లేకుండా చేసి కేవలం రూ.760 కోట్లు ఏటా రాయల్టీ చెల్లించేలా అప్పగించారన్నారు. సబ్ లీజు ఇవ్వరాదనే నిబంధనను త్రోసిరాజంటూ ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడైన శేఖర్ రెడ్డికి చెందిన టర్న్‌కీ ఎంటర్ ప్రైజెస్‌కు సబ్ లీజుకు ఇచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత ఆయన బయటకు ఎందుకు వెళ్లిపోయారో తెలియదని పురందేశ్వరి అన్నారు. నెలకు ఇసుకపై ప్రభుత్వానికి రూ.188 కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా, కేవలం రూ.63 కోట్లు మాత్రమే వస్తోందని తెలిపారు. మిగిలిన రూ.120 కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు జమ అవుతున్నట్లు ఆమె చెప్పారు. ఈ లెక్కన 16 మాసాల్లో రూ.రెండు వేల కోట్ల ఇసుక నగదు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరిందంటూ ఆమె వివరించారు. నిబంధనల ప్రకారం కలెక్టర్, మైనింగ్ ఏడీ అనుమతులతో ఇసుక తవ్వకాలు జరగాల్సి ఉండగా జేపీ వెంచర్స్ గుమాస్తా ఇచ్చే అనుమతులతోనే తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ఇసుక తవ్వకాల్లో జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) నిబంధనలు కూడా పాటించడం లేదంటూ ఆమె చెప్పారు. చిత్తూరు జిల్లాలోని 18 రీచ్‌లకు సంబంధించి ఎన్‌జీటీ రూ.18 కోట్లు జరిమానా విధిస్తే, హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారన్నారు. రాష్ట్రంలో అత్యధిక శాతం బీ1 కేటగిరీ రీచ్‌లే ఉన్నట్లు చెపుతూ నదీ గర్భంలో సైతం రహదార్లు నిర్మించి భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారన్నారు. ప్రజా జీవనం అస్తవ్యస్తం చేసే అరాచక శక్తుల దోపిడీని వెలెత్తి చూపడమే కాక ప్రజలను చైతన్యపరిచేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. అక్రమాల అడ్డుకట్ట పడే వరకు పోరాటం చేస్తామని, మద్యం విషయంలో అధికార పక్షం ఎదురు దాడులకు బెదిరేది లేదని పురందేశ్వరి స్పష్టం చేశారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**రూ. 5 కోట్ల 30 లక్షల 96 వేల సొత్తు స్వాధీనం**



**తణుకు, (పశ్చిమ గోదావరి) ప్రభ న్యూస్ :** అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 5కోట్ల 30లక్షలు సొత్తు రికవరీ చేశారు. మునుపెన్నడూ ఇంత పెద్దమొత్తంలో సొత్తు రికవరీ చేయలేదని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.తణుకు పట్టణంలో ప్రధాన కూడలి నరేంద్ర సెంటర్‌లోని నగల దుకాణంలో సెప్టెంబర్ 12న జరిగిన చోరీ కేసును ఛేధించేందుకు ఏలూరు రేంజ్ డిఐజి.జివిజి. అశోక్‌కుమార్ పర్యవేక్షణలో పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్ తాడేపల్లిగూడెం డి.ఎస్.పి అయిన సి. శరత్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మహారాష్ట్ర సాంగ్లి జిల్లాలో సుమారు 40 రోజులు గాలింపులో అక్కడ స్థానిక క్రైమ్ బ్రాంచ్ పోలీసుల సహాయంతో సూరజ్ కుంబార్, కైలాష్ శిల్కో, యస్. కే. సాధిక్‌లను అక్టోబర్ 13న మహారాష్ట్రలో అరెస్టు చేశామన్నారు.

అనంతరం అక్టోబర్ 18న ఇంకో ముద్దాయి అమిత్ సంపత్ పాటిల్‌ను అరెస్టు చేసి, చివరగా ఈ కేసులో ప్రధాన సూత్రధారి అయిన నితిన్ పాండు రంగ జాదవ్ అలియాస్ బాక్సర్ అనే దాదాను అతని అనుచరుడు అయిన ఓంకార్ జాదవ్ ను అక్టోబర్ 30న మహారాష్ట్రలో అరెస్టు చేసి దొంగిలించిన బంగారాన్ని రికవరీ చేశామన్నారు.. అరెస్టు అయిన నితిన్ జాదవ్ పైన గతంలో రెండు బందిపోటు నేరాలు, రెండు హత్య యత్నం. కేసులతో కలిపి మొత్తం 11 నేరాలున్నాయన్నారు.

ఈ కేసులో మొత్తం ఎనిమిది కేజీల 816 గ్రాముల బంగారం, కారు రికవరీ చేశామని, మొత్తం ఆస్తి విలువ 5 కోట్ల 30 లక్షల 96 వేల రూపాయలు విలువ అని పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ముద్దాయిలను అరెస్టు చేసి ఎంతో చాకచక్యంగా కేసును చేదించిన తాడేపల్లిగూడెం డి.ఎస్.పి.సి శరత్ రాజ్ కుమార్, తణుకు రూరల్ సీఐ సిహెచ్ ఆంజనేయులు, తణుకు టౌన్ సిఐ ఎం నాగరాజు, సీఐ.సిహెచ్ వెంకటేశ్వరరావు, ఇరగవరం ఎస్సై డి. ఆదినారాయణ, భీమవరం సిసిఎస్ ఎస్ఐ కే.చంద్రశేఖర్, తాడేపల్లిగూడెం ఎస్సై కే.సుధాకర్ రెడ్డి, ఏఎస్ఐ.ఎస్.శ్రీధర్, ఏఎస్ఐ పి. సంగీతరావు, పోలీస్ సిబ్బందిని అభినందించి ఎస్పీ నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

# సీనియర్ డీజీ అనురాధ పదవీ విరమణ

**డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఘన సత్కారం**



**అమరావతి, ఆంధ్రప్రభ:** సీనియర్‌ఐపీఎస్ అధికారిణి ఏఆర్ అనురాధ పదవీ విరమణ చేశారు. సీనియర్‌ఐపీఎస్ అధికారి అయిన ఆమె భర్త ఎన్‌వి సురేంద్రబాబు డీజీ హోదాలో ఇటీవలే రిటైర్డ్ అయ్యారు. కాగా అనురాధ కూడా డీజీ హోదాలో పదవీ విరమణ చేయగా మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీపీ కెవి రాజేంద్రనాధ్ రెడ్డి అనురాధ, సురేంద్రబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. పోలీస్‌శాఖ లో సుదీర్ఘ కాలం అమూల్యమైన సేవలు అందించారని ఈ సందర్భంగా డీజీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు డిజిలు, అడిషనల్ డిజిలు, ఐజిలు, డిఐజీలు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు గడువు ఈనెల 30 వరకు పొడిగింపు

**అమరావతి, ఆంధ్రప్రభ:** 2024 మార్చిలో జరుగనున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫీజు గడువును ఈనెల 30 వరకు పొడిగిస్తూ అధికారులు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. జనరల్ గ్రూప్స్, వొకేషనల్ చదివే రెగ్యులర్, ఫెయిల్ అయిన విద్యార్థులతో పాటు, ప్రైవేటుగా చదివే విద్యార్థులకు హాజరులో మినహాయింపు ఇస్తూ పరీక్షలకు అవకాశం కల్పించారు. నవంబరు 1వ తేదీ నుండి 30 వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. గడువు దాటిన వారు రూ వెయ్యి జరిమానాతో డిశంబరు 1 నుండి 15వ తేదీలోపు చెల్లించాలన్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ డిశంబరు 1వ తేదీ లోగా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అకౌంటకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

టెండర్స్/06/నిట్ నెం.97 టు 103/ఎఇ/2023 తేది: 26-10-2023

వైఎస్ఆర్ కడప జిల్లా పరిధిలోని 7 పనులకు అంచనా విలువ: రూ.77.30 లక్షలతో ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కోసం నిర్ణయించిన తేది: 02.11.2023 మ.03.00 గం.ల నుండి 15.11.2023, మ.3.00 గం.ల వరకు. వివరాలను www.eprocurement.gov.inలో పొందవచ్చును. ఫోన్: 7093172946

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీ రాజ్ డివిజన్, జమ్మలమడుగు

Ro.No. 11429/CL/Advt/1/1/2021-22, Dt: 31.10.2023



NELCAST LIMITED

CIN : L27109AP1982PLC003518

Regd. Office: 34, Industrial Estate, Gudur - 524 101. Tel: 08624 - 251266.
Fax: 08624 - 252066. Wesite: www.nelcast.com Email: nelcast@nelcast.com

30 సెప్టెంబర్, 2023తో ముగిసిన త్రైమాసికం మరియు అర్ధ సంవత్సరం కొరకు ఆడిట్ చేయని స్వతంత్ర & ఏకీకృత ఆర్థిక ఫలితాల యొక్క నివేదిక

(₹ లక్షలలో)

| క్ర సం. | వివరాలు | స్వతంత్ర | | | | | | ఏకీకృత | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | ముగిసిన 3 నెలలు | | | ముగిసిన అర్ధ సంవత్సరం | | ముగిసిన సంవత్సరం | ముగిసిన 3 నెలలు | | | ముగిసిన అర్ధ సంవత్సరం | | ముగిసిన సంవత్సరం |
| | | 30.09.2023 | 30.06.2023 | 30.09.2022 | 30.09.2023 | 30.09.2022 | 31.03.2023 | 30.09.2023 | 30.06.2023 | 30.09.2022 | 30.09.2023 | 30.09.2022 | 31.03.2023 |
| | | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేసినవి | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేయనివి | ఆడిట్ చేసినవి |
| 1 | కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం | 36263.66 | 29639.28 | 33166.13 | 65902.94 | 63121.23 | 128011.84 | 36263.66 | 29639.28 | 33166.13 | 65902.94 | 63121.23 | 128011.84 |
| 2 | పన్నుకు ముందు నికరలాభం (సాధారణ కార్యకలాపాలు మరియు అసాధారణమైన అంశాల నుండి)* | 2231.82 | 920.94 | 1631.40 | 3152.76 | 2719.58 | 4031.70 | 2231.82 | 920.94 | 1631.40 | 3152.76 | 2719.58 | 4031.70 |
| 3 | పన్ను తరువాతి నికర లాభం (సాధారణ కార్యకలాపాలు మరియు అసాధారణమైన అంశాల నుండి)* | 1663.89 | 717.63 | 1215.03 | 2381.52 | 1991.63 | 2973.54 | 1663.89 | 717.63 | 1215.03 | 2381.52 | 1991.63 | 2973.54 |
| 4 | పన్ను తరువాత మొత్తం సమగ్ర ఆదాయం | 1641.36 | 707.55 | 1188.84 | 2348.91 | 1946.73 | 2933.19 | 1641.36 | 707.55 | 1188.84 | 2348.91 | 1946.73 | 2933.19 |
| 5 | ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ. 2/- చొప్పన పూర్తిగా చెల్లించినది) | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 | 1740.02 |
| 6 | ఇతర ఈక్విటీ (ఆడిట్ చేసిన ఆస్తి అప్పుల పట్టికలో చూపిన విధంగా) | | | | | | 45100.04 | | | | | | 45100.04 |
| 7 | ప్రతి వాటా ఆర్జనలు రూ. 2/- చొప్పన (త్రైమాసికాల కొరకు ఈపీఎస్ వార్షికరించబడనిది) బేసిక్ | 1.91 | 0.82 | 1.40 | 2.74 | 2.29 | 3.42 | 1.91 | 0.82 | 1.40 | 2.74 | 2.29 | 3.42 |
| | డైల్యూటెడ్ | 1.91 | 0.82 | 1.40 | 2.74 | 2.29 | 3.42 | 1.91 | 0.82 | 1.40 | 2.74 | 2.29 | 3.42 |

గమనిక :
సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజ్‌లతో దాఖలు చేయబడిన ఆర్థిక ఫలితాల యొక్క సవివర నమూనా యొక్క సారాంశం పైన తెలుపబడినది. త్రైమాసిక / వార్షిక ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి నమూనా స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్లు: www.bseindia.com మరియు www.nseindia.com మరియు కంపెనీ వెబ్‌సైట్ www.nelcast.com పై లభించును.
* కంపెనీ వారికి పై కాలాలలో నివేదించదగిన ఏవేని అసాధారణ అంశాలు ఏవీ లేవు.

Place : Chennai
Date : 30.10.2023

For Nelcast Limited
P. Deepak
Managing Director